ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
శుక్రవారం 19 డిసెంబరు 2025 www.prajaswaramdailly.com 4 pm


### ఇంటి తనఖా ...
## వైద్యవిద్యార్థినికి సాయం

సిద్దిపేట, ప్రజాస్వరం
బీఆర్ ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తన పెద్ద మనసును చాటుకున్నారు. పీజీ వైద్యవిద్య చదువుతున్న విద్యార్థిని మమత చదువు కోసం ఏటా రూ.7.50 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఏదైనా ఆస్తి తనఖా పెడితేనే రుణం ఇస్తామని బ్యాంకర్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని హరీశ్ రావు దృష్టికి మమత, ఆమె తండ్రి రామచంద్రం తీసుకెళ్లారు. దీంతో ఆయన సిద్దిపేటలోని తన ఇంటిని తనఖా పెట్టి రూ.20 లక్షల విద్యారుణం ఇప్పించారు. విద్యార్థిని హాస్టల్ ఫీజు కోసం రూ.లక్ష నగదు అందజేశారు.



## 41 మంది మావోయిస్టుల
# లొంగుబాటు



హైదరాబాద్, ప్రజాస్వరం
తెలంగాణ డీజీపీ ఎదుట 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి, ఒడిశా, ఛత్తీస్ గఢ్ కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు, ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మిగతా మావోయిస్టులంతా ఛత్తీస్ గఢ్ కు చెందిన వారిగా డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టుల వద్ద నుంచి 24 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు ఉన్నట్లు డీజీపీ తెలిపారు.

**మిగిలిన మావోయిస్టులు కూడా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా నిచ్చారు. ప్రతి ఒక్కరికీ పునరావాసం ప్యాకేజీ కింద లొంగిపోయిన 41 మందికి కలిపి ప్రభుత్వం తరఫున మొత్తం రూ.1.46 కోట్ల నగదు బహుమతిని అందజేయనున్నట్లుగా తెలిపారు. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు ఇవాళ పంపిణీ చేస్తున్నామని అన్నారు. వాటితో పాటు ఆయుధాలకు విడిగా నగదు బహుమతిని కూడా ప్రభుత్వం అందిస్తుందని.. వాటిలో ఎల్ఎంజీ రైఫిల్‌కు రూ.5 లక్షలు, ఏకే-472కు 4 లక్షలు ఇస్తామని అన్నారు.**

**ఒత్తిడితోనే బయటికి**

**పార్టీ నాయకత్వంపై అసంతృప్తి, క్షేత్రస్థాయి కేడర్లను తమకు ఏమాత్రం పరిచయం లేని కొత్త ప్రాంతాలకు పంపడం, స్థానిక ప్రజల మద్దతు కరువవ్వడం పోలీసుల నిరంతర ఒత్తిడి కారణంగా తాము బయటకు రావాలని నిర్ణయించుకున్నాం. ముఖ్యంగా అడవిలో సరైన సౌకర్యాలు లేకపోవడం, అనారోగ్య సమస్యలు, ప్రభుత్వ పునరావాస పథకాలపై ఉన్న నమ్మకం జనజీవనం స్రవంతిలోకి వచ్చేలా చేశాయి.**

**- మావోయిస్టులు**

### పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో
# అంబేడ్కర్ కీలక పాత్ర
## రాష్ట్రపతి ముర్ము

హైదరాబాద్, ప్రజాస్వరం

పబ్లిక్ సర్వీస్ కమిషన్ల విషయంలో అంబేద్కర్ కీలకపాత్ర పోషించారని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గుర్తుచేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో 2 రోజుల పాటు సదస్సు నిర్వహించనున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ చైర్ పర్సన్ల జాతీయ సదస్సులో పాల్గొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ చైర్ పర్సన్ల సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



నియామకాల విషయంలో సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయన్నారు. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైందని తెలిపారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరమన్నారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి సూచించారు. కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ , మంత్రి సీతక్క, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, యూపీఎస్‌సీ ఛైర్మన్ అజయ్ కుమార్ హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై సదస్సులో చర్చించారు.వివిధ రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలు, పరస్పర సహకారం వంటి అంశాలపై చర్చించారు.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

**బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో శుక్రవారం భద్రతా సిబ్బందికి, నక్సలైట్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. భైరామ్‌గఢ్-ఇంద్రావతి ప్రాంతంలోని అటవీ కొండల్లో మావోయిస్టు కార్యకర్తలు ఉన్నారనే సమాచారం మేరకు జిల్లా రిజర్వ్ గార్డ్ బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి.**




## 25 వరకు ప్రభాకర్ రావు.. పోలీసు కస్టడీ

**విచారణకు ప్రభాకర్ రావు సహకరించడం లేదన్న సిట్**

**సిట్ నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం**

హైదరాబాద్, ప్రజాస్వరం
ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టడీని సుప్రీంకోర్టు ఈనెల 25 వరకు పొడిగించింది. విచారణకు ఆయన ఏమాత్రం సహకరించడం లేదని సిట్ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.
నిందితుడు విచారణలో కీలక సమాచారం ఇవ్వకుండా, దర్యాప్తునకు సహకరించడం లేదని సిట్ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు మరోసారి కస్టోడియల్ విచారణ అవసరమని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, సిట్ అభ్యర్థనను అంగీకరించింది. ఈనెల 25 వరకు ప్రభాకర్ రావును సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో డిసెంబర్ 12న ప్రభాకర్ రావు లొంగిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి వారం రోజుల పాటు ఆయన్ను విచారించిన సిట్, కస్టోడియల్ రిపోర్టును కోర్టుకు సమర్పించింది.



## రామ్‌వంజీ సుతార్ మృతిపై కేసీఆర్ సంతాపం



హైదరాబాద్, ప్రజాస్వరం
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ రూపశిల్పి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత రామ్ వంజీ సుతార్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రామ్ సుతార్ శిల్ప కళా రంగంలో ఒక కోహినూర్ వజ్రం లాంటి వారని కేసీఆర్ కొనియాడారు. "ప్రపంచ ప్రఖ్యాత శిల్పి అయిన రామ్ సుతార్ సేవలను, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ రూపంలో తెలంగాణ రాష్ట్రం వినియోగించుకోవడం గర్వకారణం. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అత్యంత సుందరంగా అంబేడ్కర్ స్ఫురద్రూపాన్ని 125 అడుగుల ఎత్తులో తీర్చిదిద్దిన ఆయన తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు" అని అన్నారు. రామ్ సుతార్ కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## 150కి పైగా విమాన సర్వీసులు రద్దు

ఢిల్లీ, ప్రజాస్వరం
150కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి.. మరో 200 సర్వీసుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేసింది . శుక్రవారం ఉదయం 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని హెచ్చరించింది. ఈ అంతరాయాలు కొనసాగుతాయని దిల్లీ ఎయిర్‌పోర్ట్ వెల్లడించింది. పంజాబ్, హరియాణా, దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## చాయ్ పే చర్చ

**ప్రధాని మోదీ, ప్రియాంకా గాంధీ హాజరు**

ఢిల్లీ, ప్రజాస్వరం
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటితో ముగిశాయి. ఈ సమావేశాల నిరవధిక వాయిదా తర్వాత స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు తేనీటి విందు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, పలువురు అఖిలపక్ష ఎంపీలు పాల్గొన్నారు. సమావేశంలో ప్రియాంక నియోజకవర్గం వయనాడ్ గురించి మోదీ చర్చించినట్లు తెలుస్తోంది.

